

**శ్రీకాంతాచారికి ఘన నివాళి**

బొమ్మలరామారం, డిసెంబర్ 3 : మలి దశ తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి 15వ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన చేసిన పోరాటాన్ని కొనియాడారు.

బొమ్మలరామారం : అమరుడు శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు


నమస్తే తెలంగాణ


యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, బుధవారం 4 డిసెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI




రాజాపేటలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల గేటు ముందు నిరసన తెలుపుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్‌వీ నాయకులు

# రూ.2లక్షలపైన మాఫీ సంగతేంది?




## ప్రైవేట్‌లో మిత్తీలకు తెచ్చి కట్టిన రైతులు

- ఇప్పుడు రెండు లక్షల వరకే మాఫీ
- ఆశగా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న కర్షకులు
- నాలుగో విడుత జాబితాపై సర్కారు గోప్యత
- అధికారికంగానే 5300 మందికి నో మాఫీ
- సర్కారుపై దుమ్మెత్తిపోస్తున్న రైతులు

'ఇచ్చింది గోరంత.. ప్రచారం కొండంత' అన్న విధంగా ఉంది రాష్ట్ర ప్రభుత్వ తీరు. అదిగో వస్తది.. ఇదిగో వస్తది అని ఊరించిన రుణమాఫీ హుళక్కే అయ్యింది. నాలుగో విడుతలోనైనా మాఫీ అవుతుందని నమ్మిన రైతుల ఆశలు అడియాసలయ్యాయి. అరకొరగా మాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతులు బండబూతులు తిడుతున్నారు.

– యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ)



**సర్కారుపై దుమ్మెత్తిపోస్తున్న రైతులు..**

అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. కానీ.. అధికారంలోకి వచ్చిన సుమారు 8 నెలల తర్వాత జూన్ 18నుంచి రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో నాలుగు దఫాల్లో 80,982 మందికి మాఫీ చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. తాజాగా నాలుగో విడుతలో 11,690 మందికి రూ.111.65 కోట్లు మాఫీ కానున్నాయి. అయితే ఇప్పటి వరకు రూ.2లక్షల లోపు రుణం ఉన్న వారికి మాత్రమే మాఫీ అయినట్లు బ్యాంకు అధికారులు చెబుతున్నారు.

**మిత్తీలకు తెచ్చి కట్టిన రైతులు**

ప్రభుత్వం రూ.రెండు లక్షల్లోపు ఉన్న వారికి మాత్రమే మాఫీ చేస్తామని కొర్రీ పెట్టింది. అంతకంటే ఎక్కువ ఉన్న వారికి మాఫీ చేయబోమని స్పష్టం చేసింది. అయితే రూ.2లక్షలకు పైన ఉన్న అమౌంట్ రైతులే చెల్లించాలని తిరకాసు పెట్టింది. సదరు మొత్తాన్ని చెల్లించాకే ప్రభుత్వం చెప్పిన రూ.రెండు లక్షలు మాఫీ చేస్తుందని చెప్పారు. దీంతో జిల్లాలో వేలాది మందికి రుణమాఫీ కాలేదు. పైన అమౌంట్ కడితేనే మాఫీ చేస్తామని సర్కారు చెప్పడంతో తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లించేందుకు అపసోపాలు పడ్డారు. మాఫీకి అర్హత పొందేందుకు రైతులు బయట అప్పులు చేశారు. ప్రైవేట్‌లో రెండు, మూడు రూపాయల మిత్తీకి తెచ్చి బ్యాంకులో మిగిలిన అమౌంట్‌ను క్లియర్ చేశారు. ఇలా రూ.20వేల నుంచి రూ.లక్ష వరకు బయట బాకీలకు తెచ్చారు. ఇప్పుడు రెండు లక్షలకు పైన ఉన్నోళ్లకు మాఫీ కాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మాఫీ చేయాలనే ఉద్దేశం లేనప్పుడు తమతో డబ్బులు ఎందుకు కట్టించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నాలుగో విడుత మాఫీ పూర్తయిందని ప్రకటించింది. దీంతో తమకు మాఫీ అయ్యిందో.. లేదోనని రైతులు బ్యాంకులు, పీఏసీఎస్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ పేర్లను చెక్ చేసుకుంటున్నారు. బ్యాంకులో డబ్బులు జమ కాకపోవడంతో వ్యవసాయ అధికారులను ఆరా తీస్తున్నారు. అధికారులు మాత్రం రుణమాఫీపై స్పష్టమైన సమాధానాలు ఇవ్వడంలేదు. మరోవైపు రుణమాఫీ కాకపోవడంపై రైతులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. రుణాలు మాఫీ అవుతాయనే ఆశతో ఉన్నోళ్లు ఇప్పుడు ప్రభుత్వం చేయకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ఇక చేసేదేం లేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బండబూతులు తిడుతున్నారు.

**అధికారికంగానే 5,300 మందికి కోత**

తొలి మూడు విడుతల్లో రాష్ట్ర ప్రభుత్వం అనేక కొర్రీలు పెట్టింది. రేషన్ కార్డు, ఇంటికి ఒకరు తదితర కారణాలతో మాఫీని నిలిపేసింది. దీంతో రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అనేక చోట్ల ఆందోళనలు కూడా జరిగాయి. దీంతో సర్కారు దిగొచ్చింది. మాఫీ రానోళ్ల వివరాలను వ్యవసాయ శాఖ సేకరించింది. ఇలా జిల్లాలో 17వేల మంది నుంచి వివరాలు సేకరించినట్లు అధికారులే చెబుతున్నారు. తాజాగా నాలుగో విడుతలో 11,690 మందికి మాత్రమే మాఫీ చేశారు. అంటే ఇంకా 5,300 మందికి మాఫీ కాలేదని అధికారికంగానే అర్థమవుతున్నది. ఇది కేవలం 2లక్షలలోపు వాళ్ల వివరాలు మాత్రమే. రూ.2లక్షలకు పైగా మాఫీ కావల్సిన వాళ్లు ఇంకా వేలల్లో ఉన్నారు. ఇక నాలుగో విడుత జాబితాకు సంబంధించి ప్రభుత్వం గోప్యత ప్రదర్శిస్తున్నది. ఇప్పటి వరకు తుది విడుత జాబితా విడుదల చేయకపోవడం గమనార్హం. జాబితా వస్తే మాఫీ కాని రైతుల నుంచి వ్యతిరేకత, ఆగ్రహాలు వ్యక్తమవుతాయనే సీక్రెట్‌గా ఉంచారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# సంక్షోభంలో సంక్షేమ హాస్టళ్లు

- రేవంత్‌రెడ్డి పాలనలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు విలవిల
- బీఆర్ఎస్ ఫైవ్‌మెన్ కమిటీ సభ్యుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

రాజాపేట/ ఆలేరు టౌన్, డిసెంబర్ 3 : కాంగ్రెస్ పాలనలో సంక్షేమ హాస్టళ్లు సంక్షోభంలో చిక్కుకున్నాయని బీఆర్ఎస్ ఫైవ్ మెన్ కమిటీ సభ్యుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం రాజాపేట మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను, ఆలేరు పట్టణ కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలను డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆంజనేయులుగౌడ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, తుంగ బాలుతో కలిసి మంగళవారం సందర్శించారు. రాజాపేటలో పాఠశాల లోపలికి రాకుండా గేటు మూసి తాళం వేశారు. దాంతో వారు గేటు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. దవాఖానకు వెళ్లి వస్తున్న ఇద్దరు విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆలేరు పాఠశాలలో వంట గది, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సమస్యలు తెలుసుకునేందుకు వస్తే పాఠశాల గేట్లకు తాళాలు వేయడం దుర్మార్గ చర్య అన్నారు. బీఆర్ఎస్ నాయకులను నిర్బంధించినంత మాత్రాన తమ పోరాటం ఆగదని, సీఎం చేసే అక్రమాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. గురుకులాల్లో వసతులు కల్పించనందునే తమను గేటు బయట నిలబెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్‌తో 48 మంది విద్యార్థులను పొట్టన పెట్టుకున్న దుర్మార్గుడు రేవంత్‌రెడ్డి అన్నారు. గురుకుల పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నీటి వసతి కూడా లేదని, నాణ్యమైన భోజనం అందించడం లేదని తెలిపారు. కిటికీలకు దోమ తెరలు లేవని, భవనాలకు అద్దె కట్టే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదని అన్నారు. నాసిరకం సరుకులు తెచ్చి విద్యార్థులకు పెడుతున్నారని, ప్రిన్సిపాల్, స్టాఫ్, విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తుండడంతో సమస్యలను బయట చెప్పుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. వసతులు కల్పించే వరకు రేవంత్‌రెడ్డి సర్కారుపై పోరాటం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. విద్యార్థులకు రావాల్సిన మెనూ, కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం గౌడ్, రాజాపేట మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.



తరగతి గదిలోనే విద్యార్థుల లగేజీ.. పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి

# చదువు.. నిద్ర ఒకే గదిలో..!

- అడిషనల్ కలెక్టర్‌కు సమస్యలు ఏకరువు పెట్టిన కేజీబీవీ విద్యార్థినులు

సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 3 : చదువుకోవడానికి, నిద్రించడానికి అఖరికి బట్టలు మార్చుకోవడానికి కూడా ఒకే గది వాడుతున్నామని పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డికి స్థానిక కేజీబీవీ విద్యార్థినులు మొర పెట్టుకున్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఏసీ వీరారెడ్డి మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వంట సామగ్రి, వాష్ రూమ్, తరగతి గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు గేటు లేదని, వాష్ రూమ్‌లు సరిపోవడం లేదని, తరగతి గదులు సరిపడా లేవని, ఉపాధ్యాయులు కావాలని, డార్మేంటరి, డైనింగ్ హాల్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఏసీకి విన్నవించుకున్నారు.

సమస్యలను విన్న అడిషనల్ కలెక్టర్.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి త్వరలోనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అందుకు ముందు తాసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో పిన్సిపాల్ శివరంజిని, తాసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ నరసింహారావు, ఆర్ఐ జూబేర్ పాల్గొన్నారు.

# ప్రారంభించాల్సిన పనులకు మళ్లీ శంకుస్థాపన

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరు
- మరోసారి ప్రారంభించేందుకు ఎమ్మెల్యే యత్నం



చొల్లేరు– జమ్మాపురం రోడ్డు



2023 అక్టోబర్ 6 ప్రారంభించిన శిలాఫలకం

యాదగిరిగుట్ట, డిసెంబర్ 3 : గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరై శంకుస్థాపన చేసి ప్రారంభించాల్సిన పనులకు మరోసారి శంకుస్థాపన చేసేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య యత్నిస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే పలు పనులకు ఇదే రీతిలో శంకుస్థాపన చేయగా తాజాగా చొల్లేరు గ్రామానికి మంజూరైన బీటీ రోడ్డు పనులకు తిరిగి శంకుస్థాపన చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలోని చొల్లేరు గ్రామం నుంచి జమ్మాపూర్ వరకు సుమారు 1.8 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గతేడాది సెప్టెంబర్ 30న డీఎంఎఫ్ కింద రూ.1.50 కోట్లు మంజూరు చేస్తూ అప్పటి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి జీఓ జారీ చేశారు. 2023 అక్టోబర్ 6న అప్పటి ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. టెండర్ ప్రక్రియ పూర్తయి పనులు చేపట్టాల్సి ఉంది. ఇంతలోనే ఎన్నికలు రావడంతో పనులు పెండింగ్‌లో పడ్డాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులు చేపడితే ఆ పార్టీకి పేరు వస్తుందన్న అక్కసుతో తమ ప్రభుత్వమే మంజూరు చేసిందని ప్రజలను మభ్య పెట్టేందుకు తిరిగి శంకుస్థాపన చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే పూనుకున్నారని మాజీ జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, చొల్లేరు మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య, గ్రామస్తులు ఆరోపించారు. ఏడాది క్రితమే పనులు కొనసాగిస్తే ఇప్పటికి పనులు పూర్తయి రోడ్డు అందుబాటులోకి వచ్చేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సొంత డబ్బా కొట్టుకునేందుకు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారని మండిపడ్డారు. వీలైతే నిధులు మంజూరు చేసి కొత్త పనులు చేపడితే బాగుంటుందని హితవు పలికారు.

# వైభవంగా వెండి మొక్కు జోడు సేవ



హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

యాదగిరిగుట్ట, డిసెంబర్ 3 : లక్ష్మీనరసింహస్వామికి వెండి మొక్కుజోడు సేవోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా సాగింది. సాయంత్రం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించారు. స్వామివారిని గరుడ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై ఉంచి ప్రాకార మండపంలో ఊరేగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బంగారు పుష్పాలతో అర్చన జరిపారు. అనంతరం నిత్య తిరు కల్యాణం జరిపారు. సాయంత్రం స్వామివారికి దర్బార్ సేవ చేపట్టారు. ఆంజనేయస్వామికి ఆకుపూజ ఘనంగా జరిగింది. సుమారు 7వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.15,66,688 ఆదాయం సమకూరిందని అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్ రావు తెలిపారు.

**హుండీ ఆదాయం రూ. 5,35,41,432**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి హుండీ ఆదాయం ఐదున్నర కోట్లు దాటిందని అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్ రావు తెలిపారు. మంగళవారం కొండ కింద వ్రత మండపంలో 76 రోజుల హుండీని లెక్కించగా నగదు 5,35,41, 432 రూపాయలు, మిశ్రమ బంగారం 215 గ్రాములు, మిశ్రమ వెండి 7 కిలోల 700 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. వీటితో పాటు అమెరికా డాలర్లు 1,272, ఆస్ట్రేలియా డాలర్లు 205, ఇంగ్లండ్ పౌండ్స్ 135, యూఏఈ ధీరమ్స్ 95, నేపాల్ రూపీస్ 5, సౌదీ అరేబియా రియల్ 227, సింగపూర్ డాలర్లు 34, ఖతర్ రియాల్ 18, ఓమన్‌కు చెందిన బైస 300, కెనడా –165 డాలర్లు, మలేషియా –87 రింగ్గిట్స్, కువైట్, న్యూజీలాండ్‌కు చెందిన కరెన్సీ స్వామివారి హుండీలో చేరినట్లు పేర్కొన్నారు.



# బీబీనగర్ ఎయిమ్స్‌లో మొదటి ఎండోస్కోపిక్ సర్జరీ

చికిత్స అనంతరం వైద్యులు

బీబీనగర్, డిసెంబర్ 3 : మండల పరిధిలోని ఎయిమ్స్‌లో గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో మొదటి ఎండోస్కోపిక్ సర్జరీ (డయాగ్నస్టిక్ హిస్టెరోస్కోపీ, ఎండోమెట్రియల్ బయాప్సీ)ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్జరీలో పాల్గొన్న డాక్టర్లు మాట్లాడుతూ ఎయిమ్స్‌లో డయాగ్నస్టిక్, ఆపరేటివ్ హిస్టెరోస్కోపిక్ సర్జరీలను నిర్వహిస్తున్నామని, ఏయూబీ, వంధ్యత్వం, పాలీపెక్టోమీలు, ఫైబ్రాయిడ్ పాలిప్స్ వంటి సమస్యలకు చికిత్స అందిస్తున్నామని తెలిపారు. త్వరలో డయాగ్నస్టిక్ హిస్టెరో లాప్రోస్కోపీ, లాపరోస్కోపిక్ శస్త్ర చికిత్సలను ప్రారంభిస్తామని తెలిపారు.

# దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతున్న మోదీ

- ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కాంగ్రెస్ విజయోత్సవాలా?
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సీపీఎం జిల్లా మహాసభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

మిర్యాలగూడ, డిసెంబర్ 3 : కేంద్రంలోని మోదీ సర్కార్ దేశ ప్రజల సంపదను కార్పొరేట్లకు, అదానీ, అంబానీలకు దోచి పెడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో జరుగుతున్న సీపీఎం జిల్లా మహాసభల్లో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సౌర విద్యుత్ ప్రాజెక్టు కోసం భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వ పెద్దలకు అదానీ గ్రూప్ భారీగా ముడుపులు ముట్టజెప్పిందని అమెరికా కోర్టులో కేసు నమోదైందన్నారు. అదానీ వ్యవహారం దేశానికి అప్రతిష్టగా మారిందని, దీనిపై ఇప్పటికీ ప్రధాని మోదీ నోరు మెదపకపోవడం శోచనీయమని విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించకుండా విజయోత్సవాలు నిర్వహించడమేంటని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదని, హైడ్రా, మూసీ వంటి వాటిని తీసుకొచ్చి ప్రజల సమస్యలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. పేదలకు ముందే ఇండ్లు నిర్మించి ఇచ్చి ఆ తరువాత మూసీ ప్రక్షాళన చేయాలని సూచించారు. రేవంత్‌రెడ్డి మాటల్లోనే ప్రజాస్వామ్యం ఉందని, చేతల్లో నిర్బంధకాండ ప్రయోగిస్తున్నారని పేర్కొన్నారు. సీపీఎం పోరాటంతోనే ఫార్మాసిటీ రద్దు అయ్యిందని, హామీల అమలు కోసం ప్రభుత్వం మెడలు వంచుతామని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేశ్, సయ్యద్ హాషం, కందాల ప్రమీల, ప్రభావతి, నాగార్జున, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, బండా శ్రీశైలం, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కొంపెల్లి గ్రామంలోని జేబీ పత్తి మిల్లు వద్ద ధర్నా చేస్తున్న రైతులు

# తేమ పేరుతో పత్తిలో తరుగు

- మిల్లు యాజమాన్యం తీరును నిరసిస్తూ రైతుల ధర్నా

మునుగోడు, డిసెంబర్ 3 : ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు సీసీఐ తీరుతో ఆందోళన చెందుతున్నారు. మునుగోడు మండలం కొంపెల్లి గ్రామంలో గల జేబీ పత్తి మిల్లు యాజమాన్యం తేమ సాకుతో ఒక్కొక్క ట్రాక్టర్‌కు సుమారుగా 80నుంచి 200 కిలోల వరకు తరుగు తీస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే పత్తిని కొనుగోలు చేయకుండా తిరిగి పంపిస్తున్నారు. ఈ క్రమంలో రైతులు మంగళవారం మిల్లు వద్ద ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, వ్యవసాయ అధికారులు అక్కడికి వచ్చి ధర్నాను విరమింపజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 8శాతం తేమ ఉన్న ఏ గ్రేడ్ పత్తి క్వింటాలుకు రూ.7,521 ధర నిర్ణయించిందన్నారు. 9నుంచి 12శాతం వరకు తేమ ఉంటే ఒక్కొక్క శాతానికి రూ.75 తక్కువగా కొనుగోలు చేయాలని నిర్ణయించిందని చెప్పారు. ధాన్యం మాదిరిగా పత్తి ఆరబెట్టుకునే పరిస్థితి ఉండదని, సీసీఐ లేదంటే ప్రైవేటుగా అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు. ఎలక్ట్రానిక్ కాంటాల వినియోగంలో వ్యాపారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. జేబీ పత్తి మిల్లులో సీసీఐ అధికారులు, మిల్లు యాజమాన్యం, మధ్య దళారులు కలిసి రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. తేమ సాకుతో కోత విధించిన పత్తిని రశీదులో చూపకుండా తరుగును తీసేసి రశీదు ఇస్తున్నారని తెలిపారు.

# ఇక్కత్ డూప్లికేట్‌ను అరికట్టాలి

- టై అండ్ డై అసోసియేషన్

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 3 : పోచంపల్లి ఇక్కత్ డిజైన్లతో తయారు చేస్తున్న ప్రింటెడ్ చీరెలను అరికట్టాలని పట్టణ చేనేత టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు కోరారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో చేనేత సమస్యలపై మంగళవారం ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోచంపల్లి నుంచి ఆంధ్రా ప్రాంతాల్లో నేయిస్తున్న మగ్గాలను అరికట్టాలన్నారు పట్టు చీరె సాదాగా నేయించి మధ్యలో ప్రింటెడ్ వేస్తున్నారని, దీని వల్ల పోచంపల్లి ఇక్కత్‌కు ప్రమాదం ఏర్పడుతుందని, కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడా పారిశ్రామికవేత్తలు సూరత్‌లో ప్రింటెడ్ వస్త్రాలు తయారు చేయిస్తూ అతి తక్కువకు విక్రయిస్తున్నారని తెలిపారు. పది వేల రూపాయల విలువైన పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరె ప్రింటెడ్‌లో 600 నుంచి వెయ్యి రూపాయల్లో లభిస్తున్నాయన్నారు. దీంతో నేత కార్మికులకు ఉపాధి లేక, నేసిన వస్త్రాలు అమ్ముడుపోక అప్పులపాలై వలస పోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్, చేనేత ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు రాపోలు శ్రీనివాస్, సురపల్లి రవీందర్, ఎన్నం శివకుమార్, ముస్కూరి నరసింహ, కర్నాటి బాలరాజు, సీత దామోదర్, కస్తూరి సుదర్శన్ పాల్గొన్నారు.